మసి మరక

ఆకాశం నిర్మలంగా ఉంది.

వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఉదయం తొమ్మిదిగంటల వేళ. ఆ వేళప్పుడు తుపానురావచ్చునని ఊహించడం కష్టమే! నిజం. వచ్చింది తుపానే! ఎలా వచ్చింది? ఓ మనిషి రూపంలో వచ్చింది.

మాసిపోయిన నాలుగు మూళ్ళ పంచె, గోనెపట్టలా వున్న నీలిరంగు అరచొక్కా. పొట్టి వెంట్రుకల గుండ్రటి తల. కోపంతో కందగడ్డలా జేవురించిన ముఖం. అతడి పేరు కోదండం.

సెకండ్ బెల్ మ్రోగి ప్రార్థన జరిగిన తర్వాత పిల్లల హాజరు గుర్తించి పాఠం చెప్పడంకోసం అప్పుడే పుస్తకం చేతికి తీసుకుంటున్నాను. బోను తలుపు తీయగానే పైకి దూకే తోడేలులా వచ్చిపడ్డాడు కోదండం. కాగిననూనెలో వేగి వుబ్బుతున్న మినపగారెలా మనిషి మనిషంతా కంపించిపోతున్నాడేమో. మాటలుకూడా తడబడుతున్నాయి. “హేమండీ. హెడ్డమేష్టరుఘూరూ! సెప్పండి. ఊళ్లో వుండమంటారా లేకుంటే నెత్తిన బట్టేసుకుని మా బిడ్డ పాపల్తో మమ్మల్ని ఊళ్ళోనుంచి వెళ్ళిపొమ్మంటారా? మీ కిష్టం లేకపోతే సెప్పెసెయ్యండి...”

ప్రతిరోజూ దినపత్రికలు చూచేవాణ్ణి. దొంగనోట్లు, బ్యాంకు దోపిడీలు, అమ్మాయిల్ని తీసుకెళ్ళి అమ్మెయ్యడాలు. రైలు ప్రమాదాలు, నరబలులు మొదలైన వాటిని గురించి పుష్కలంగా వినివున్నాను. కాని యిష్టమైనవాళ్ళని వూళ్ళో ఉండమని, మిగిలినవాళ్ళని వెళ్ళిపొమ్మనే హక్కు టీచర్లకుందని మాత్రం వినలేదు.

“అసలేం జరిగిందో వున్నదున్నట్టుగా చెప్పవయ్యా బాబూ?” అన్నాను. నా ఎట్ట యెదుట బెంచీలపైన కూర్చున్న కుర్రకుంకలు అత్యంత ‘సస్పెన్సు’ ఘట్టాన్ని చూస్తూ, వూపిరి బిగబట్టుకున్న ప్రేక్షకుల్లా, బొమ్మలకు మల్లే తయారైపోయి, కోదండంవైపు రిచ్చపడిపోయి చూస్తున్నారు.

“వద్దొద్దు, ఈ నిప్పులమీద నీళ్ళు చల్లే మాటలొద్దండీ మేష్టారూ! మా బిడ్డలీ మాత్రంగానైనా బ్రతికుండడం మీకిష్టం లేదు. అదే మీ ఉద్దేశం! అవునంతేనని సెప్పండి, నేను నోరు మూసుకుని వెళ్ళిపోతాను...”

ఇదేం నవ్వుటాలగా తుడిచిపెట్టుకపోయే వ్యవహారంలా కనిపించడంలేదు. ఆదమరిచి కూచుంటే నా గొంతుకకే ఉచ్చులా బిగుసుకుపోయేటట్టుంది. అందుకని వీలయినంతగా అప్రమత్తుడినై పోతూ “చూడు కోదండం! పొరబాటు చేయడమనేది మానవ సహజం, కాని జరిగిన పొరబాటేమిటో తెలిస్తే, అందుకు కారకులైన వాళ్ళని మందలించే అవకాశముంటుంది. అలాంటిదికమీదట జరగకుండా చూచే వీలుంటుంది” అన్నాను.

“చెయ్యి విరిగితే అతికిస్తారటయ్యా మీరు!” గద్దించాడు కోదండం.

నిస్సందేహంగా యిది శల్య వైద్యుల్లపని. టీచర్ల తరంగాదు.

"ఏది, ఎక్కడ వాడు?" అంటూ ఒక్క విసురుతో బయటికి వెళ్ళిన కోదండం, అక్కడ గోడచాటున ఎక్కడో నక్కి నిల్చున్న ఓ తొమ్మిదేళ్ళ కుర్రాణ్ణి లోపలికి లాక్కొచ్చాడు. చిన్న నిక్కరు పైన, గుండీల్లేని పొట్టి చొక్కా ఒకటి వేసుకుని, చింపిరితలతో, జిడ్డోడుతున్న ముఖంతో వుడుబోతు కాయలా కనిపిస్తున్న ఆ కుర్రాడు వాడి తల్లితండ్రుల సంతానంలో చిట్టచివరివాడు. మొదటివాడేమో - యిదిగో నామీద పిట పిడుగులా విరుచుకపడిపోతున్న కోదండం!

ఉడుబోతుకాయ కుర్రాడు - వాడిపేరు చక్రి - ఒక చెయ్యి పైకెత్తి పట్టుకున్నాడు. ఆ చేతిలో చక్రాయుధం లేదు. అంతకంటే భయంకరంగా రెండు వ్రేళ్ళూ కలిపి కట్టిన బాండేజీ ఒకటి కానవస్తోంది.

"ఏమిటిది? ఏమైంది?" అన్నాను కంగారుగా.

"ఏముంది? వ్రేళ్ళు సగందాకా తెగిపోయాయంతే! ఇంకా నయం! తలకాయ బొందపడి వుండాల్సింది, చేతికడ్డంగా పెట్టుకున్నాడేమో, వ్రేళ్ళు మాత్రమే తెగాయి. వద్దుబాబూ ఎందుకొచ్చిన చదువులు! ఊపిరుంటే ఉప్పమ్ముకుంటాం. ఎందుకైనా మంచిదని మీతో ఒక మాట చెప్పిపోదామని వచ్చాను."

గిరుక్కున వెనుదిరిగి ద్వారం దాకా వెళ్ళినవాడు అక్కడ ఆగి మళ్ళీ నావైపు చూస్తూ అన్నాడు. కోదండం - "అయితే ఒకటి. ఈరోజు మాకయింది. రేపొద్దున యింకొకరికవుతుంది. ఇంతపని జరిగాక యిక వూరుకునేదిన్నీ లేదు. దీని అంతేమిటో తేల్చుకోకుండా వదిలిపెట్టేదిన్నీ లేదు. ఇప్పటికింతే నేను చెప్పడం."

"అల్టిమేటం జారీ చేసిన మరుక్షణంలో కోదండం అక్కడ లేడు!'

తుపాను వస్తుంది. వెళ్తుంది. కానీ దాని తాలూకు బీభత్సమైన పరిణామం మట్టుకూ అంత తొందరగా మాసిపోయేదికాదు. కోదండం వచ్చి వెళ్ళాడు సరే! ఇక మీదట అతడేం చేయబోతున్నాడన్న ప్రశ్న గురిపెట్టిన బాణంలా నన్ను భయపెడుతోంది. ఉద్యోగరీత్యా ఈ వూరికి బదిలీ అయినప్పటినుంచి నేను కోదండాన్ని ఎరుగుదును. ఒకసారి నేను నోరుజారి "ఏమిటోయ్ కోదండం! ఈ మధ్య కనిపించడం లేదే?" అన్నాను. "ఏమిటండీ మేష్టారూ! అప్పటికీ వూళ్ళో బ్రతకలేక నేనెక్కడికైనా పారిపోయి వుంటాననుకున్నారా?" అంటూ కస్సుమన్నాడు కోదండం. నాలుగేళ్ళ క్రితం జనాభా వివరాలు నమోదు చేయడంకోసం ఊళ్ళో యిల్లిల్లూ తిరగాల్సి వచ్చింది. సమయానికి కోదండం యింట్లో వున్నాడు. "వ్రాసుకోండి సార్! మేమున్నది పదకొండు మందిమి" అన్నాడు. తీరా వ్రాసి లెక్కపెట్టుకుంటే పదిమంది లెక్క మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన వ్యక్తి ఏమైనట్టు? "బాబూ, ఒకర్ని వదలి పెట్టేశావు" అన్నాను. లెక్క వచ్చిన మనుషులకు ఆదరువు ఏర్పాటు చెయ్యండి సార్, చాలు!" అంటూ విసుక్కున్నాడు. అన్నింటికన్నా చిత్రం. ఊళ్ళో ఏ యింట్లో శుభకార్యం జరుగుతున్నా వెళ్ళేది లేదని తన కుటుంబానికొక ఆనవాయితీ ఏర్పరిచాడు కోదండం. అక్కడ మంగళవాయిద్యాలు మ్రోగుతున్నంతసేపూ, ఇక్కడ ఈ యింట్లో తలుపులు బిడాయించే వుంటాయి.

అంతవరకూ ద్వారబంధాని కటువైపున తచ్చాడుతూ వుండిపోయిన ప్యూను సిద్ధలింగం, జంకుతూనే లోపలికివచ్చి "అయ్యగారూ! సారధి మేష్టార్ని పిలవమంటారా?" అన్నాడు.

"వద్దు" అన్నాను. ఆ మాట కాస్త బిగ్గరగా అన్నానేమో సిద్ధలింగం ఉలిక్కిపడ్డాడు. బొట్టూ, కాటుకా పెట్టి పిలిచేదాకా వచ్చి సంజాయిషీ చెప్పుకోవడం తన ప్రతిష్ఠకు భంగకరమనుకుంటున్నాడేమో కుర్రపంతులు! అసలీ 'సారధి' అనే అతను ఉండేలు దెబ్బ తినని పిల్లకాకిలా ఇక్కడికి వచ్చి పడ్డాడు. వయసుకు మించిన హుందాతనం ఒకటి ఈ మనిషిలో! ఇందుకు కారణం బహుశా అతడు సంపాదించుకున్న డిగ్రీలో వుండొచ్చునని నా ఊహ. కాలేజీలో లెక్చరరు కావడానికి అవసరమైనంత చదువు చదువుకున్నప్పటికి ఉద్యోగావకాశాలకు ఏర్పడిన కక్కుర్తినిబట్టి, కన్సొలేషన్ ప్రయిజు బాపతుగా - స్టయిఫండరీ స్కీము క్రింద అతడీ బడికి పోస్టు చేయబడ్డాడు. తానేమిటో, తన పనేమిటో ఎప్పుడూ ఏ యితర లోకాల్లోనో సంచరిస్తూ వున్నట్టుంటుంది అతడి వాలకం. కానీ యితడిలో యింతలావు తలబిరుసుతనం వుంటుందని మాత్రం అనుకోలేదు. ఫరవాలేదు. పొగరుమోతు గుర్రానికి చింతబరికెల పూజ చేయడమెలాగో నాకు తెలుసు. ఇప్పుడంతకన్నా కోదండం కోపాన్ని తగ్గించడం ముఖ్యం. అందుకని "నువ్వెళ్ళి కోదండం ఏం చేస్తున్నాడో చూడవోయ్ సిద్ధలింగం! నచ్చజెప్పి యిక్కడికి తీసుకురావడానికి ప్రయత్నించు" అన్నాను.

తలనొప్పి తగ్గడానికని ఓ కుర్రాణ్ణి పంపి యింటి దగ్గరినుంచి కాఫీ తెప్పించుకున్నాను. గ్లాసు ఖాళీచేసేసరికి సిద్ధలింగం తెచ్చిన వర్తమానం నా తలనొప్పిని ద్విగుణీకృతం చేసింది.

"కోదండం కనిపించడం లేదండీ అయ్యగారూ! ఇంట్లో అడిగాను. బడినుంచి వెళ్ళగానే సీతాపురానికి బస్సెక్కాడట! వాళ్ళమ్మ చెప్పింది..."

సీతాపురమా? ఏదో స్వంత పనిమీద వెళ్ళి వుంటాడు లెమ్మనుకున్నాను. కానీ ఆ సంతృప్తికూడా క్షణంలో సగంసేపు మాత్రమే!

"మరింక మనూరికి పోలీసుస్టేషనుండడం సీతాపురంలోనే గదండీ!"

నా గుండెలు జల్లుమన్నాయి. బడిలో అలజడిని గురించి పోలీసుస్టేషనులో ఫిర్యాదు-

నా బుర్ర గిర్రున తిరిగిపోసాగింది. కాగితంపైన అక్షరాలన్నీ నల్లగా అలుక్కుపోయి నట్టున్నాయి. పాఠం చెప్పాలనిపించడంలేదు. కానీ నా కాళ్ళు నన్ను అప్రయత్నంగా కోదండం యింటికే తీసుకెళ్లాయి. వీధి గుమ్మం దాటుకుని, నడవంతా నడిచి, హాల్లోకి అడుగుపెడుతూ, అమ్మా అని పిలిచాను. ప్రత్యుత్తరం వినిపించలేదుగాని భాగ్యమ్మ కనిపించింది. కోపిష్ఠి చిత్రకారుడు కసి తీర్చుకోడంకోసం గీచిన ఆడ బొమ్మలా భాగ్యమ్మ వంటింటి గుమ్మంలో నిలచి వుంది.

కొలిమిలో కాలి చల్లబడిన ఇనుములా కాయవాటు శరీరం భాగ్యమ్మది. మొగుడు పోయిన తర్వాత తల దువ్వుకోలేదేమో, తల మాయలమరాఠీ వేషగాడు వేసుకునే టోపీలా తయారైంది. కళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయి. నిజం చెప్పొద్దు బుద్ధిమాలి

ఆకలిగొనివున్న ఆడపులి దగ్గరికి వచ్చేశానేమోనన్న అనుమానంతో ఓ అడుగు వెనక్కే వేశాను.

"ఏమండీ పంతులుగారూ?" ఉరిమినట్టుగా ప్రారంభించింది. భాగ్యమ్మ. "గవర్నమెంటు డబ్బులిస్తోందిగదా అని మీరు ముప్పూటలా మెక్కి కూచుంటే మాకు అక్షేపణ లేదు. కండలు బలిసి కొవ్వెక్కి, కళ్ళు కానరాక తల్లక్రిందులుగా నడిచినా మాకు పొయ్యేదేమీ లేదు బాబూ. మాలాంటి నోరులేని వాళ్ళ ఉసురు పోసుకోడం న్యాయమేనా మీకు? రాత్రంతా బిడ్డ కంటిపైన రెప్పవేసి వుంటే ఒట్టు, ఒళ్లు కాలిన పెనంలా పెట్లిపోయింది. ఒకటే కలవరింతలు. ఇంటిల్లుపాదికీ శివరాత్రి జాగరమే. ఎందుకండీ' మేము ఎవరబ్బ సొత్తుకు వచ్చామండీ? మిమ్మల్ని నిలదీసి అడిగే వాళ్ళెవరూ లేరా? మీ అంతట మీరే దొరలైపోయారా? మీకు పట్టపగ్గాల్లేవా? ఒసే, అమ్మీ తాయారూ, ఇక్కడిలా పంతుళ్ళు పసిపిల్లల్ని కొట్టుక తింటున్నారని మీ అన్నయ్య అదెవరీకో అర్జీ పెట్టాలన్నాడే బి.డి.వో.నా - డి.ఇ.ఓ.నా, ఎవరే అతను?'

"డి.ఇ.ఓ." తడిక ఆవలినుంచీ సవరించి చెప్పింది కూతురు.

"అవునా? ఆ మహానుభావుడికి మా మొర ఎలా వినిపించదో చూస్తాం. వచ్చే, వాళ్ళెవరో రాని, చెప్పేవాళ్ళేం చెప్పుకుంటారో చెప్పుకోని, ఇప్పుడాడంగులతో మీకేం మాటలండీ మాష్టారూ, అమ్మీ తాయారూ, అయ్యగారెళ్ళిపోగానే తలుపేసుకోవే?" "వడిసెల రాయిలా భాగ్యమ్మ పెరట్లోకి వెళ్ళిపోయింది.

బిక్కచచ్చిపోయి నేను జీవచ్ఛవంలా బయటికి వచ్చేశాను.

జడుసుకుంటే జ్వరం వస్తుందంటారు. భాగ్యమ్మతో భేటీ అయి యింటికి వెళ్ళిన తర్వాత నాకు నిజంగానే జ్వరం వచ్చినట్టు అనిపించింది. భోజనంచేసి పడుకున్నానేమో, లేవడానికి బుద్ధి పుట్టింది కాదు. బడికి వెళ్లకుండా మంచంపైన పడివుండిపోయాను.

ఈరోజుగాకపోయినా రేపో, మరునాడో ఉన్నతాధికారులు బడిపైకి వచ్చి దూకడం ఖాయం. ఎంక్వయిరీలు, ఛార్జిషీటు, ఎక్స్‌ప్లనేషన్లు, సస్పెన్షన్లూ లేదా వూష్టింగులు ఇలాంటి తతంగమంతా ఆపైన తప్పనిసరి! తెలిసో, తెలియకో సారధి వూబిలో కాలుపెట్టేశాడు. గొంతుకబంటిదాకా కూరుకుపోయాడు. చూస్తూ వూరుకుంటే బుడుంగున అందులో మునిగిపోతాడు. అబ్బే. అలా జరగడానికి వీల్లేదు. ఎలాగైనా అతడికొక అవకాశం యిచ్చి చూడడమే సబబు...

ఈ నిర్ణయానికి రావడానికి కూడా నా స్వార్థమే కారణమని తెలిస్తే ఎవరైనా విస్తుపోతారు. ఆపదలో నేను గనుక యింకొకరిని ఆదుకుంటే - నాకాపద వచ్చినప్పుడు ఇంకొకళ్ళు (వీరిలో దేవుడుకూడా వున్నాడు) నన్ను ఆదుకుంటారన్నది నా నిశ్చితాభిప్రాయం.

చేసిన పనికి బెంబేలు పడిపోతూ సారథి తన గదిలో ఖిన్నుడై కూర్చుని వుంటాడని నేనాశించాను. అలాంటిదేమీ లేకపోయేసరికి నాకు కొంత ఆశ్చర్యమో, ఆశాభంగమే కలగక తప్పిందికాదు. బ్రహ్మచారి కొంపగదా, నానా కంగాళీగా వుంటుందనుకుంటే, ఆ యిల్లెంతో నీటుగా వుంది. చెత్తలేదు. మురికిలేదు. బూజులేదు. లేనివి లేకపోగా ఉండవలసినవన్నీ ఎక్కడివక్కడ పదిలంగా వున్నాయి. అలమరా నిండుకూ పుస్తకాలు,

ఓ మూలగా ఆయిల్ స్టవ్వు, చెక్క బీరువాలో వంటచేసుకోడానికి కావలసిన పాత్రలు, వస్తువులు. హాలుకు మధ్యగా గోడవార ఓ టేబిలు, కుర్చీ. చదువుకోడానికి వీలుగా టేబులు పైకి వ్రేలాడుతున్న దీపం. బుద్ధిగా కుర్చీలో కూర్చుని తానేదో పుస్తకమే చదువుకుంటున్నాడు.

"రండి మేష్టరుగారూ! మీరా! నేనింకా ఎవరో అనుకున్నాను రండి. కూచోండి" అంటూ లేచి, కుర్చీని నాకిచ్చేస్తూ, తాను వెళ్ళి ఎదురుగా ట్రంకు పెట్టెపైన కూర్చున్నాడు.

అంతలోనే ఏదో జ్ఞప్తికి వచ్చినట్టు–

"రాకరాక నా విడిదికొచ్చేశారు. పాలు కొంచెం మిగిలి వుంది. కాఫీచేసి ఇమ్మంటారా?" అన్నాడు.

రోము నగరం కాలిపోతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్న నీరోలా సారథి చెక్కుచెదరకుండా వుండడం చూడ్డానికి విచిత్రంగానే వుంది. ఇతడు గుండెలు తీసిన బంటా? లేక వట్టి అమాయకుడా!

"పోనీ, పాలే తీసుకోండి" అంటూ పైకి లేవబోయాడు సారథి.

నాకొక వైపున ఒళ్ళు మండిపోతూవుంది. "వద్దులేవోయ్ సారధీ! నువ్వు కూచో, నాకిప్పుడు నీ సత్కారాలేమి అవసరంలేదు. సూటిగా నేను చెప్పవలసిందేదో చెప్పనివ్వు. ముందుగా నువ్వొక లీవు అప్లికేషన్ వ్రాసి నా చేతికివ్వు. అయిదు రోజులకు పెడితే అటూ యిటూ శని, ఆదివారాలు కలసి నువ్వు ఏడెనిమిది రోజులదాకా సెలవు 'అవైల్' చేసుకోవచ్చు..."

"సెలవా! నాకా! అబ్బే, అనవసరంగా సెలవు పెట్టడమెందుకండీ?"

ముసుగులో గుద్దులాటకు పూర్తిగా స్వస్తిచెప్పి – "ఎందుకంటే, తెల్లవారేటప్పటికి యిక్కడుండడం నీకు శ్రేయస్కరం కాదుగనుక!" అంటూ తేల్చి చెప్పేశాను.

"ఎందుకండీ మేష్టరుగారూ! మీరెందుకలా అనుకుంటున్నారు?" విస్తుపోతూ ప్రశ్నిస్తున్నాడు సారథి.

"అబ్బాయి సారధీ! మనమెక్కడున్నా మన్న విషయం నీకైతే తెలియకపోవచ్చు. ఇది ప్రపంచం. ఇక్కడ నువ్వు చేసేపని ఇతరులచేత గమనించబడడంలేదని, అందరి మంచి చెడ్డలు ఎప్పటికప్పుడు బేరీజు వేయబడవనీ, అందుకు ప్రతిఫలం వడ్డీ వారడితోసహా గిట్టుబాటు కాదని నువ్వనుకున్నట్టయితే అది శుద్ధ పొరబాటు. నిన్ననో, మొన్ననో నువ్వొక కుర్రాణ్ణి వ్రేళ్ళు తెగిపోయేటట్టుగా కొట్టావు. దానిపైన పోలీసులకు రిపోర్టు వెళ్ళింది. రేపో మాపో విద్యాశాఖ వాళ్ళకు పిటీషన్ అందుతుంది. ఇదేం అల్లాటప్పా వ్యవహారంకాదు.. నేను నీకు శ్రేయోభిలాషిని గనుక ముందుగానే హెచ్చరిస్తున్నాను."

ఈ చోక్రా కుర్రాడు సారథి నా అమాయకత్వాన్ని చూసి జాలిపడుతున్నట్టుగా, సడిచేయని చిరునవ్వు దొంతరల్ని వెదజల్లుతున్నాడు.

దయ్యంతో ముఖాముఖిగా ఇంటర్వ్యూ జరుపుతున్నట్టుగా దిగాలుపడిపోయి నేను చేష్టలు మాని విగ్రహంలా కూర్చుండిపోయాను.

అందాకా గోడకు చేరగిలబడి వున్న వాడు సర్దుకుని నిటారుగా కూచుంటూ అడిగాడు సారథి – "మేష్టరుగారూ నేను కొట్టలేదని చెబితే మీరు నమ్మలేరేమో!"

"దాఖలా కనిపిస్తున్నప్పుడు ఏం చెయ్యమంటావయ్యా నన్ను?" నిందించడం మాత్రమే నా వంతయింది.

"దెబ్బను గురించి తరువాత చెబుతాను, మొదట భాగ్యమ్మను గురించి కొంచెం చెప్పాలి..."

తాతకు దగ్గులు నేర్పించాలని చూస్తున్నందుకు నాకు పట్టరానంత కోపం వచ్చింది. భాగ్యమ్మను గురించి నువ్వు నాకు చెప్పడమేమిటోయ్ సారధి. తల్లి పుట్టినిల్లు మేనమామకు తెలియకపోతే గదా!

"భాగ్యమ్మకొక భర్త వుండేవాడు. భాగ్యమ్మను పెళ్ళాడడం అతడు చేసిన నేరం గంపెడు పిల్లల్ని కనడం భాగ్యమ్మ చేసిన నేరం. ఎలాగైనా లోకంలో బ్రతికి పోవాలన్నది ఆ పిల్లలు చేస్తున్న నేరం. పెద్దబ్బాయి కోదండమున్నాడే, వాడు ప్రతిరోజూ టౌనుకు వెళ్ళి విస్తర్లు అమ్ముకొస్తేగాని ఆ యింట్లో పూటగడవదు. రెండో బిడ్డ తాయారు. ఆ అమ్మాయికి పెళ్ళయివుంటే ఈపాటికి నలుగురు బిడ్డల తల్లై వుండేది. ఇలా చెప్పుకపోతే చాలా పెద్దలిస్టే వుంది. అంతేనా, యింకా ఏమైనా వుందా నువ్వు భాగ్యమ్మను గురించి చెప్పగలిగింది"

"అరటిపండు ఒలిచి చేతిలో పెట్టేసినట్టు మీరింత స్పష్టంగా చెప్పేశాక నాకింక ఏం మిగిలి వుంటుందండీ మేష్టరుగారూ! లేదంటే ఆ ఇంటితో నాకున్న కొద్దిపాటి అనుబంధాన్ని గురించి చెప్పుకోవాలి. ఈ వూరికి వచ్చిన కొత్తలో నేను భాగ్యమ్మ ఇంట్లో వీధివైపు గదిలో వుండేవాణ్ణి. ఆరునెలలు గడవక ముందే నేను వేరే చోటు వెదుక్కోవలసి వచ్చింది. అద్దె విషయంలో పేచీ వచ్చి మాత్రం కాదు. పదో పదిహేనో పాతికో నికరంగా యింతే మొత్తమనీ నిర్ణయం వుంటుంది గనుక, జీతం రాగానే చెల్లించుకోవచ్చు. అలా కాకుండా రెండుగా, మూడుగా, అయిదుగా, పదిగా నెల పొడుగునా ఇచ్చుకోవాలంటే ఎవరికైనా యిబ్బందే! అందులోనూ స్వల్ప జీతగాణ్ణిగదా. అది నా తాహతుకు మించిన వ్యవహారమైపోయింది. నేనక్కడినుంచి వచ్చేశాక, ఆ గదిలో చేరే వాళ్ళు ఎవరూ లేకపోవడాన భాగ్యమ్మకు రావలసిన అద్దె డబ్బులు రాకుండా పోయాయి. తిరిగి యిచ్చుకోవలసిన అవసరం లేకుండా అప్పులు దొరికే అవకాశాలు కూడా లేకుండా పోయాయి. అందుకని భాగ్యమ్మకు నాపైన కోపం వుండడం తప్పుకాదని నేను చెప్పను..."

"ఈ శిక్షను మనసులో పెట్టుకుని యిలా చేసిందని నీ వాదన. పోనీ, అలాగే ననుకుందాం. నీ మట్టుకు నువ్వు చేసిన పనేమిటి? వ్రేళ్ళు తెగిపోయి వుండాల్సిన ఆ దెబ్బను గురించి సంజాయిషీ యిచ్చుకుంటావయ్యా నువ్వు?" వీలయినంత కర్కశంగానే ప్రశ్నించి, అతడిపైకి రూక్షవీక్షణాలు గుప్పిస్తూ కూర్చున్నాను.

"చూడండీ మేష్టరుగారూ ఒక్కొక్కప్పుడు కల్పనకంటే వాస్తవమే చిత్రంగా వుంటుందనుకోవటం బహుశా ఇలాంటి విషయాలను గురించే కావచ్చు. ఆ కుర్రాడు అదే చెక్రిగాడు జానెడు పొడుగు షరాయిపైన పొట్టంతా కనపడే పొట్టి షర్టు తొడుక్కుని మామూలుగా రెండో గంట కొట్టిన తర్వాత బడికొస్తాడు. ఒరే చక్రిగా, రా, నా ప్రక్కన కూచో అని పలకరించే సహ విద్యార్థి వుండడు. మనిషికీ, మనిషికీ తేడా వుండగూడదనీ, విచక్షణ చూపడం నేరమనీ మానవుడు గ్రహించి చాలకాలమైంది. కానీ ఏ కారణం వల్లనో తెల్లటి బట్టపైన దట్టమైన మసి మరకలా క్లాసులో చక్రీగాడొక్కడు మాత్రం ప్రత్యేకంగా

కనిపిస్తాడు. పదిమంది పిల్లలు కలిసి జట్టుగా ఆడుకుంటూ వుంటే దూరంగా నిలబడి బిక్కుబిక్కుమంటూ చూడ్డమే వాడు చేయగలిగింది. కాదని దగ్గరికి వెళ్తే కసిరి కొడతారు. ఒక కుర్రాడు ఏదో తాయిలం తింటుంటాడు. ఇంకొకడు బొమ్మల పుస్తకం చూస్తుంటాడు. మరొకడు గాలిపటం ఎగుర వేస్తుంటాడు. ఏ ఆనందంలోనూ తనకు వాటా లేదని తెలిసేసరికి వాడికి ఏడుపొస్తుంది. కోపమొస్తుంది. కోపాన్ని వెలిబుచ్చే ఉపాయం లేకపోతే, ఏడిస్తే ఓదార్చేవాళ్ళు లేకపోతే వాడి భావావేశాలన్నీ ఏమౌతాయి! వాడిపైకె తిరగబడతాయి. ఆ వుక్రోషంలో వాడు తన పొడుగాటి గోళ్ళతో తన శరీరాన్నే గిచ్చుకుంటాడు. తన ముఖాన్నే రక్కుకుంటాడు..."

శారీరకంగానే గాదు, మానసికంగా కూడా చైతన్యం లుప్తమై పోయిన ఆ స్థితిలో నేను సారథి వైపు తెల్లబోయి చూస్తూ వుండిపోయాను.

ఒక నిముషం తర్వాత అతడు పూర్తి చేశాడు.

"చుట్టూరా ఎంతటి నిస్సహాయ పరిస్థితులు క్రమ్ముకుని వున్నా వాడికీ వయసు పెరుగుతోందిగదా! పెరిగే వయసుతో బాటుగా వాడు విధించుకునే హింసలో సైతం మోతాదు హెచ్చుతూ వుండొచ్చునని నా అనుమానం."

ఊరంతా నిద్రపోయిన ఆ నిశిరాతిరి వేళ మా యిద్దరి మధ్య చాలా సేపటివరకు మౌనమే నెలకొని వుండిపోయింది.

***

యధాతథంగా నేను సారథి మాటల్ని నమ్మేశానని చెప్పడానికి వీల్లేదు. కానీ ఎన్ని రోజులు గడిచినా పోలీసులకు రిపోర్టు అందినట్టుగాని, డి.ఇ.ఓ.గారికి పిటీషన్ చేరినట్టుగానీ తెలియకపోవడంతో అతడి వాదంలో నిజం లేకపోలేదనిపించింది. ఇంతలో గాయం మానిపోయి, చక్రిగాడు కూడా బడికి రావడం ప్రారంభించాడు. చేజారిపోయిన క్లూ మళ్ళీ దొరికినట్టై వాణ్ణి నా గదిలోకి పిలిపించాను. బెదురుతూ బెదురుతూ వచ్చాడు. బెత్తం చేతికి తీసుకుని జడిపించే సరికి నిజం బయటపెట్టేశాడు.

మునసబుగారు హైదరాబాదుకు వెళ్ళి, తిరిగివస్తూ ఆరు పేనాలున్న ప్లాస్టిక్కు పెట్టెను తెచ్చారు. అందులో ఒకటి తనకిమ్మన్నాడు చక్రిగాడు. 'పోరా, పో' అన్నాడు మునసబుగారి అబ్బాయి. 'నువ్వేం చెబుతే అది చేస్తా'నన్నాడు చక్రిగాడు. 'అయితే చేతిని బండపైన పెట్టి పలకతో బలంగా మోదుకో'మన్నాడు మునసబుగారి అబ్బాయి.

కొత్తపేనా దొరుకుతుందేమోనన్న అడియాసతో అంతపనీ చేశాడు చక్రిగాడు. తత్ఫలితమే ఈ గాయం!

సందర్భానికి అతికిపోయినట్టుంది గదా అని ఆ అబద్ధంద్వారా సారథిని కొంచెం బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం మాత్రం జరిగింది. అంతకుమించి భాగ్యమ్మకైనా తన కొడుకుపైన నమ్మకం వున్నట్టు లేదు.

"నేను కొట్టుకున్నానని చెబుతే మా అమ్మకొడుతుంది సార్! అందుకని... అందుకని" మళ్ళీ నేనుకూడా కొడతానేమోనని భోరున ఏడవసాగాడు చక్రిగాడు.

❖ ఆంధ్రజ్యోతి వారపత్రిక – నవంబర్, 1975. ❖